

యువతకు సర్కారు అండ
నిరుద్యోగ యువతకు జగన్ సర్కారు అండగా నిలుస్తోంది. ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాలు పెంపొందిస్తోంది.
8లో



టమాట కిలో రూ.22
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22, కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 35.4°/21.3°
జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో నీటిమట్టం తగ్గుముఖం



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోయింది. దీంతో నీటి మట్టం కూడా వేగంగా తగ్గుతోంది. ఆదివారం నాటికి 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యంలో 28.966 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 4,678 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 1,632.42 అడుగుల వద్ద 103.459 టీఎంసీల నీరు ఉండింది. ప్రస్తుతం 1,605.16 అడుగుల వద్ద 28.966 టీఎంసీల నీరు ఉండడం గమనార్హం. ఇదే సమయంలో 9,066 క్యూసెక్కుల మేర నీరు వివిధ కాలువలకు విడదలవుతోంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,680 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెల 10వ తేదీ వరకే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

నీళ్లు దుర్వినియోగం కాకుండా చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

రామగిరి: మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువను అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం పరిశీలించారు. హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీరు ఎక్కడా దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించడంతో ఇప్పటికే కర్నూలు జిల్లాలో కాలువను ఆయన పరిశీలించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చెర్లోపల్లి వద్ద ఉన్న కెనాల్‌ను కూడా పరిశీలించినట్లు అడిషనల్ డీజీ పేర్కొన్నారు. ఎక్కడా జలచౌర్యం జరగకుండా, కాలువ నీరు తూములగుండా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఈఈ మురళీ, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చిన్నగౌస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: గొల్లపల్లి రిజర్వాయర్‌ను కూడా అడిషనల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలసి పరిశీలించారు. డీఈ లక్ష్మీదేవితో రిజర్వాయర్ ఎత్తు, వెడల్పు, పంపు హౌస్‌ల వివరాలు, నీటినిల్వ శాతం తదితర వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట డీఎస్పీ మహబూబ్‌పీరా, సీఐ రాజా రమేష్, ఎస్ఐ రమేష్‌బాబు ఉన్నారు.

ఐదుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

నల్లమాడ: దొన్నికోట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి మీనాక్షి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ -1 వేమనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో సక్రమంగా విధులకు హాజరు కాకపోవడం, సకాలంలో సిలబస్ పూర్తీ చేయకపోవడం, ఆగస్టు నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో మండల విద్యాధికారుల నివేదిక ఆధారంగా నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం సరస్వతి, ఎస్‌జీటీలు సుమలత, మాధవీలత, నాగమణి, లక్ష్మీదేవి, ఉర్దూ ఉపాధ్యాయుడు సైఫొద్దీన్‌కు నోటీసులు అందాయన్నారు. నోటీసులు అందిన తర్వాత మూడురోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని డీఈఓ జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన ఆదివారం వందన డ్యాన్స్ అకాడమీ చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో అలరించారు. చిన్నారులకు ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు.

పండుగలా వ్యవసాయం

వ్యవసాయం దండగ అన్నవాళ్ల నోళ్లను మూయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పండుగలా మార్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. రైతు భరోసా మొదలు ఆర్బీకేల వరకూ... విత్తన పంపిణీ నుంచి పంట కొనుగోళ్ల దాకా అన్నింటిలోనూ రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవడంతో ఏ ఇబ్బంది లేకుండా కర్షకులు పంటలు సాగు చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతకు పెద్దపీట

- సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు
- నాలుగేళ్లలో జిల్లా రైతులకు రూ.4,449 కోట్ల లబ్ధి
- రేపు పుట్టపర్తికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వైఎస్సార్ రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం



కదిరి వద్ద రబీలో సాగైన వేరుశనగ పంట



పుట్టపర్తి అర్బన్: నాలుగున్నరేళ్ల పాలనలో వ్యవసాయ రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవనశాఖ, సిరికల్చర్, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, ఏపీఎంఐపీ ద్వారా జిల్లాలోని రైతులకు ఏకంగా రూ.4,449.65 కోట్ల లబ్ధి చేకూర్చారు. చిన్న, సన్న, పెద్ద రైతులు తేడా లేకుండా అందరినీ ఆదుకుంటూ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. దీనికి తోడు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి సాగులో తోడుగా నిలుస్తున్నారు.

416 గ్రూపులకు 1165 పరికరాలు

శ్రీసత్యసాయి జిల్లాలో చిన్న, సన్నకారు, మధ్యస్థ, పెద్ద రైతులందరినీ కలుపుకుంటే 3,65,875 మంది ఉన్నారు. సాధారణ సాగు భూమి 3,23,763 హెక్టార్లుగా ఉంది. ప్రతి ఏటా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి విత్తన పంపిణీ చేపడుతున్నారు. దీనికి తోడు గత యేడాదిలో రెండు సార్లు రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, కోత మిషన్లు సబ్సిడీపై అందజేశారు.ఇందుకుగాను యంత్రాలు పంపిణీ రోజే రెండుసార్లు రూ.10.78 కోట్లు సబ్సిడీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. 416 సీహెచ్‌సీ గ్రూపులకు 1165 యంత్ర పరికరాలు అందజేశారు.

2,75,331 మందికి రైతు భరోసా

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 చొప్పున జిల్లాలోని 2,75,331 మంది రైతులకు రూ.1599.75 కోట్లు అందజేశారు. రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతులకు సున్నా వడ్డీ కింద 1,71,881 మంది రైతులకు రూ.69.77 కోట్లు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు 1,98,974 మందికి రూ.565.26 కోట్లు అందించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద 18,342 మంది రైతులకు రూ.16.05 కోట్లు పంపిణీ చేశారు.

ఉద్యాన రైతుల అభివృద్ధికి కృషి

ఉద్యానశాఖ కింద సమగ్ర ఉద్యాన పథకం, పండ్ల తోటల నిర్వహణ, నీటి వనరుల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, యాంత్రీకరణ ,రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సేకరణ యంత్రాలు, కోల్డ్ స్టోరేజీలు, హైబ్రిడ్ కూరగాయల ఉత్పత్తి కింద నాలుగున్నర ఏళ్లలో సుమారు 21,007 మంది రైతులకు రూ.1845.04 కోట్లు అందజేశారు. దీంతో పాటు పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

ఏపీఎంఐపీ ద్వారా నాలుగేళ్లలో పలు విడతల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేశారు. 39,647 మంది రైతులకు 46,057 హెక్టార్ల భూమికి సరిపడా పరికరాలను అందజేశారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించారు. ఇందుకోసం రూ.254.55 కోట్లు ప్రభుత్వం వ్యయం చేసింది.

పట్టు రైతులకు భరోసా



సెరికల్చర్‌శాఖ ఆధ్వర్యంలో మల్బరీ మొక్కలు నాటినందుకు, పట్టు పురుగుల పెంపకం గదుల నిర్మాణం, పురుగుల పెంపకం సామగ్రి, కూలింగ్ పరికరాలు, చంద్రికలు, సోలార్ సిస్టం, ఫారం మెకనైజేషన్ కింద సిల్క్ సమగ్ర పథకం, ఆర్‌కేవీవై పథకాలలో 16,028 మంది రైతులకు రూ. 33.49 కోట్లు వ్యయం చేసింది.

ఉచితంగా పశువులకు టీకాలు



పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు నష్ట పరిహారం కింద ఈ యేడాది రూ.11.50 కోట్లను ప్రభుత్వం పాడి రైతులకు అందజేసింది. దీంతో పాటు ఒక్కో వాకింగ్ ఫ్రిడ్జ్ కోసం రూ.16 లక్షలతో 8 ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసింది. పశువులకు ఉచితంగా లక్షల విలువైన గాలికుంటు వ్యాధి నివారణ మందులు అందజేశారు.

జలకళ కింద ఉచిత బోర్లు



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోని మెట్ట భూము లున్న రైతులకు పండ్ల తోటల పెంపకానికి 11,494 మంది రైతులకు 29,786 హెక్టార్ల భూమిని సాగులోకి తీసుకు రావడానికి రూ.20.96 కోట్లు వెచ్చించారు. దీంతో పాటు 1592 మంది రైతులకు జలకళ పథకంలో ఉచితంగా బోర్లు వేసి మోటర్లు అందించారు. దీనికి 22.50 కోట్లు వ్యయం చేసింది.

జగనన్నకు రుణపడి ఉంటాం



రైతులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రైతు భరోసా, పంటల బీమా, విత్తన సబ్సిడీ లబ్ధి పొందాను. చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. ఇలాంటి ప్రభుత్వం బహుశా దేశంలోనే ఉండదు.
– రవీంద్రరెడ్డి, యరగొండవారిపల్లి, అమడగూరు

సంక్షేమం, అభివృద్ధి



రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిది. పంటకు ముందే ఇంటి వద్దకే విత్తనాలు ఇస్తున్నారు. పంటలు చేతికి రాగానే అధికారులు వచ్చి కొనుగోలు చేసి నగదు అందిస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధిని సీఎం జగన్ పరుగు పెట్టిస్తున్నారు.
– చంద్రశేఖర్, పైపల్లి, పుట్టపర్తి

ఆర్‌బీకేలతో అన్ని విధాలా లబ్ధి



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచింది. విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం, మట్టి నమూనాల సేకరణ, వ్యవసాయ సలహాలు, ఇలా ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి. గతంలో ఇలాంటి కార్యక్రమాలు చూడలేదు.
– ఈశ్వరరెడ్డి, బీడుపల్లి, పుట్టపర్తి

జిల్లాలోని రైతులు	3,65,875 మంది
సాధారణ సాగు భూమి	3,23,763 హెక్టార్లు
నాలుగున్నరేళ్లలో ఆయా శాఖల ద్వారా రైతులకు చేకూరిన లబ్ధి	
వ్యవసాయశాఖ	రూ.2,250.83 కోట్లు
ఉద్యానశాఖ	రూ.1,845.04 కోట్లు
ఏపీఎంఐపీ	రూ. 254.55 కోట్లు
సెరికల్చర్	రూ.33.49 కోట్లు
పశుసంవర్ధకశాఖ	రూ.11.50 కోట్లు
ఉపాధి పథకం	రూ.20.96 కోట్లు
జలకళ ద్వారా	రూ.22.50 కోట్లు
యంత్ర సేవ పథకం సబ్సిడీ	రూ.10.78 కోట్లు
మొత్తం	రూ.4449.65 కోట్లు

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్/పుట్టపర్తిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా పర్యటన సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో కలసి బహిరంగ సభాస్థలి, విమానాశ్రయం కాన్వాయ్ రహదారి పరిశీలించారు. అనంతరం బహిరంగ సభ, బ్యారికేడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బందోబస్తు నిర్వహించే పోలీసులను అప్రమత్తం చేశారు.

బందోబస్తు ఇలా..

సీఎం పర్యటన నేపథ్యంలో ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 121 ఎస్ఐలు, 242 మంది ఏఎస్ఐలు, 509 మంది కానిస్టేబుళ్లు, 96 మంది మహిళా పోలీసులు, 244 మంది హోంగార్డులు, 3 సెక్షన్ల ఏఆర్ పోలీసులు, 8 బృందాల స్పెషల్ పార్టీ పోలీసులు భద్రతా ఏర్పాట్లకు వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద ఒక ప్రైవేటు క్రికెట్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తచెరువు, గోరంట్ల వైపు నుంచి పుట్టపర్తికి వచ్చే వాహనాలు సూపర్ ఆస్పత్రి వద్ద నుంచి బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి మీదుగా పుట్టపర్తికి చేరుకోవాలన్నారు. అలాగే నల్లమాడ, బుక్కపట్నం వైపు నుంచి పుట్టపర్తికి వస్తూ గోరంట్ల, బెంగళూరుకు వెళ్లే వాహనాలు గణేష్ సర్కిల్ నుంచి బ్రాహ్మణపల్లి వయా ఆస్పత్రి మీదుగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

సభాస్థలి దగ్గర...

పుట్టపర్తిలో జరగనున్న బహిరంగ సభకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సభా వేదిక ప్రాంగణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, రైతులు, ప్రజలు ఎవరికి కేటాయించిన స్థలాల్లో వారు ఉండేలా చూడాలన్నారు. పాసుల జారీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాలి, వర్షం, ఎండలను దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సుమారు లక్ష మంది వరకూ బహిరంగ సభలో పాల్గొనవచ్చని అంచనా వేశారు. అందరికీ తాగునీరు సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, సీఐలు రవీంద్రారెడ్డి, రామయ్య, ఆర్ఐలు టైటాస్, నారాయణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తిందాం..ఆరోగ్యంగా ఉందాం!

- పౌష్టికాహారంపై ఐసీడీఎస్ వినూత్న ప్రదర్శన
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో స్టాళ్ల ఏర్పాటు
- గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన



సోమందేపల్లిలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం

పుట్టపర్తి అర్బన్: నిరుపేదలకు స్థానికంగానే కార్పొరేట్ వైద్య అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పౌష్టికాహారంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జబ్బు చేసిన తర్వాత చికిత్స ఎంత ముఖ్యమో... అసలు జబ్బు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అంతే అవసరమని తెలియజెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు చెబుతున్నారు. చిరుతిళ్లకు బదులు తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుందని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి పోషకాలతో కూడిన తినుబండారాలను ప్రదర్శిస్తున్నారు. వాటిని ఎలా తయారు చేసుకోవాలో కూడా వివరిస్తున్నారు.

ప్రదర్శనలో ఉంచే ఆహార పదార్థాలు

గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో ముఖ్యంగా మునగాకు లడ్డు, రాగి లడ్డు, మొలకెత్తిన గింజలు, మునగాక ఫ్రై, మునగాకు కారం, రకరకాల చిరుధాన్యాలు, పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు, బాలామృతం వంటివి ప్రదర్శిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అందే విటమిన్లు, వాటి ద్వారా లభించే ఐరన్, వ్యాధి నిరోధక శక్తి తదితర అంశాలపై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బొప్పాయి, జామ, వంటి పండ్లను ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి దాకా జిల్లాలోని 397 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో ఐసీడీఎస్ స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీల ద్వారా అందజేసే సరుకుల ప్రదర్శన

గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహార సరుకులను సైతం ప్రదర్శనలో ఉంచుతున్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలు 7వ నెల నుంచి మూడేళ్ల దాకా ఇచ్చే ఆహారాన్ని, సంపూర్ణ పోషకాహార కిట్‌లను ప్రదర్శిస్తున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం, కంది పప్పు, గుడ్లు, పాలు వంటి వాటిని ప్రదర్శనలో ఉంచి అవగాహన కల్పిస్తున్నారు.

సరుకుల పంపిణీ ఇలా...

పిల్లలకు తొలి విడతలో 1.5 లీటర్లు పాలు, 13 కోడి గుడ్లు, రెండో విడతలో ఒక లీటరు పాలు, 12 గుడ్లు అందజేస్తారు. గర్భిణులు, బాలింతలకు మొదటి విడతలో 3 కిలోల బియ్యం, కేజీ కంది పప్పు, 500 గ్రాముల ఆయిల్, 13 గుడ్లు, 2.5 లీటర్లు పాలు, రెండు కిలోల రాగి పిండి, కేజీ అటుకులు, ఎండు ఖర్జూరం, బెల్లం, చిక్కీలు అందజేస్తారు. రెండో విడతలో 12 కోడి గుడ్లు, 2.5 లీటర్ల పాలు పంపిణీ చేస్తారు.

విశేష ఆదరణ



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. స్టాళ్లలో ఐరన్, క్యాల్షియం, ఇమ్యూనిటీని పెంచే ఆహార పదార్థాలుంచి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. వాటిని తింటే ఇక ఐరన్ మాత్రలతో పని ఉండదని తెలియజెపుతున్నాం. గర్భిణులకు కలిగే మేలును వివరిస్తున్నాం.
– లక్ష్మీకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

నేటి స్పందన రద్దు

పుట్టపర్తి అర్బన్: నేడు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తికి విచ్చేస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్ల దృష్ట్యా స్పందనను రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలను సమర్పించడానికి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ...

పుట్టపర్తి టౌన్: నేడు (సోమవారం) నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎస్పీ కార్యాలయంలో జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

'జెడ్పీ' వెబ్‌సైట్ అద్భుతం



జిల్లా పరిషత్ కార్యాలయం



కేతన్‌గార్గ్, ఇన్‌చార్జ్ సీఈఓ, జిల్లా పరిషత్, అనంతపురం

అనంతపురం సిటీ: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా అనంతపురం ఉమ్మడి జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ రూపొందించిన వెబ్‌సైట్ అద్భుతంగా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి కితాబునిచ్చారు. విజయవాడలో శనివారం నిర్వహించిన సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓలు, డీఎల్‌పీఓల రాష్ట్ర స్థాయి సమావేశంలో కేతన్ గార్గ్‌ను వారు అభినందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యుల వివరాలు, స్టాండింగ్ కమిటీల వివరాలు, ఇప్పటి వరకు జరిగిన సర్వసభ్య సమావేశాల మినిట్స్, ప్రతి ఏడాది రూపొందించే బడ్జెట్ అంచనాలు, జిల్లా పరిషత్ నుంచి విడుదలైన నిధులు, చేపట్టిన పనులు, చెల్లింపులు, సిబ్బంది, విధులు, సమాచార హక్కు చట్టం, ముఖ్యమైన ఇతర అధికారుల వివరాలతో కూడిన ఫోన్‌నంబర్లు, పనుల పర్యవేక్షణ వంటి సమస్త వివరాలు పొందుపరచడం బాగుందంటూ కొనియాడారు. వెబ్‌సైట్ గురించి సీఈఓ కేతన్ గార్గ్ డెమో ద్వారా వివరించారు. ఈ తరహా వెబ్‌సైట్‌ను అన్ని జిల్లాల సీఈఓలు రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని సీఈఓ కేతన్‌గార్గ్ తెలిపారు.

క్లుప్తంగా

ఉరవకొండలో షూటింగ్ సందడి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: తమిళనాడుకు చెందిన వైనాట్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ఉరవకొండలో ఆదివారం సినిమా షూటింగ్ ప్రారంభమైంది. దర్శకుడు చిన్నా మాట్లాడుతూ... చైల్డ్ సెంటిమెంట్ నేపథ్యంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో తమిళ హీరో, ఇతర ఆర్టిస్టులు ఉన్నారన్నారు. మరో నెల రోజుల పాటు ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, తొలిరోజు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్, కలెక్టర్ కార్యాలయంలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని సినిమా షూటింగ్‌ను ఆసక్తిగా గమనించారు.

అరసం జిల్లా కార్యవర్గం ఎన్నిక

హిందూపురం: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. హిందూపురంలోని ఎన్జీఓ కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియలో గౌరవాధ్యక్షుడిగా సడ్లపల్లి చిదంబరరెడ్డి, అధ్యక్షుడిగా సిద్దగిరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా సొంటి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా నాగమణి, సహాధ్యక్షుడిగా అశ్వత్థ నారాయణ, సహ కార్యదర్శులుగా గంగాధర్, ఉదయ్‌భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, బాలగంగాధర్ తిలక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో టెక్కీ మృతి



మృతుడు సోమశేఖర్

లేపాక్షి: విద్యుత్ షాక్‌కు గురై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం రూరల్ మండలం వీరంపల్లికి చెందిన సోమశేఖర్(31) బెంగళూరులోని ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోం విధానంలో భాగంగా ఇంటి వద్దనే ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఖాళీ సమయంలో లేపాక్షి మండలం పి.బసనపల్లి వద్ద తమకున్న తోటకెళ్లి వ్యవసాయ పనులు చూసుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తోటకెళ్లిన ఆయన మల్బరీ షెడ్డును నీటితో శుభ్రం చేసేందుకు సిద్ధమై విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కుప్పకూలాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, సోమశేఖర్‌కు భార్య ఆశ, ఓ కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

యువతకు సర్కారు అండ

- నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగాల కల్పన
- జిల్లాలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ, 7 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు
- బ్యాచ్‌కు 30 నుంచి 60 మందికి శిక్షణ
- ఇప్పటి వరకూ 1,091 మందికి ఉద్యోగాల కల్పన



పుట్టపర్తిలోని స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. చదువుకున్న ఏ ఒక్కరూ నైపుణ్యం లేక ఉద్యోగాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఉపాధి, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే తిరుపతి, విశాఖ కేంద్రంగా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి, వాటి పరిధిలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఓ స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పారు. విద్యార్హత, నైపుణ్యాన్ని బట్టి నిరుద్యోగులందరికీ వివిధ ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వడమే కాక, పలు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.

శిక్షణ కోసం నగరాలకు వెళ్లకుండా

గతంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం నిరుద్యోగ యువతీయువకులు బెంగళూరు, హైదరాబాద్ లాంటి మహా నగరాలకు వెళ్లేవారు. కేవలం శిక్షణకే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ చెల్లించేవారు. వసతి, భోజన ఖర్చులు అదనంగా ఉండేవి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిరుద్యోగ యువతకు స్థానికంగానే నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైసా ఖర్చులేకుండా ఉచిత వసతి, భోజన సదుపాయాలనూ సమకూరుస్తోంది. ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్ కోర్సులు విరివిగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విప్లవాన్ని సృష్టించిన మెషిన్ లర్నింగ్‌తో పాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆండ్రాయిడ్ అప్లికేషన్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్, పైథాన్, జావా, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోక్యాడ్, ఈ-కామర్స్ మార్కెటింగ్, రెవిట్.... తదితర కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇస్తోంది.

జిల్లాలో ఒక కళాశాల, ఏడు సెంటర్లు

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చడం, తద్వారా 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే దక్కేలా చేయడమే లక్ష్యంగా జిల్లాలో ఓ స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలతో పాటు ఏడు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన హిందూపురంలో ఓ కళాశాలతో పాటు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్నీ ఏర్పాటు చేశారు. ఏ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత అదే నియోజకవర్గంలో శిక్షణ పొందేలా అధికారులు చొరవ తీసుకున్నారు. విద్యార్హతను బట్టి వివిధ కోర్సుల్లో ఒక్కొక్క బ్యాచ్‌కు 30 నుంచి 60 మందికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ కళాశాల పరిధిలో ఆరు నెలలు పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. జిల్లాలో స్కిల్ హబ్ సెంటర్లు ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకూ ప్రతి నియోజకవర్గ పరిధిలో పది చొప్పున జాబ్ మేళాలు జరిగాయి. వీటికి 2,600 మంది అభ్యర్థులు హాజరు కాగా, 1,092 మందికి ఉద్యోగాలు దక్కాయి.

జిల్లాలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల వివరాలు

నియోజకవర్గం	సెంటర్
హిందూపురం	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
హిందూపురం	నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్
మడకశిర	ఎస్‌వైటీఆర్, ప్రభుత్వ కళాశాల
ధర్మవరం	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
కదిరి	ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల
పుట్టపర్తి	శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,బుక్కపట్నం
పెనుకొండ	పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
రాప్తాడు	యూత్ ట్రైనింగ్ సెంటర్, రామగిరి

ఉచిత శిక్షణ



జిల్లాలోని నిరుద్యోగులకు వారి చదువును బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంప్యూటర్ కోర్సులపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తోంది. ఈ కోర్సులు అభ్యసించాలంటే నగరాలకు వెళ్లాల్సిందే. రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఈ శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వివిధ కంపెనీలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

– అబ్దుల్ ఖయ్యూం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

టాటా కంపెనీ ఉద్యోగినయ్యా



ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా మూడు నెలలు శిక్షణ పొందాను. ఈ శిక్షణ చాలా ఉపయోగపడింది. ప్రస్తుతం బెంగళూరులోని టాటా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. దీంతో మా కష్టాలు చాలా తీరాయి. మాలాంటి నిరుద్యోగులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

– భవ్య, పెనుకొండ

గత ప్రభుత్వం పట్టించుకోలేదు



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ధర్మవరంలో ఏర్పాటైన స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పొందాను. త్వరలో జాబ్‌మేళా ఏర్పాటు చేసి, ఉద్యోగావకాశం కల్పిస్తామన్నారు. వృత్తి పరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

– కుమార్, నామాల గ్రామం, సీకేపల్లి మండలం

బెల్ట్‌తో ఉరి వేసుకుని...

చిలమత్తూరు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు బెల్ట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లి గ్రామానికి చెందిన శివ(25), చిలమత్తూరు మండలం కోడూరు థామస్‌మన్రో తోపు సమీపంలో ఉన్న ఓ గార్మెంట్స్ పనిచేసేవాడు. ఈ క్రమంలో అదే పరిశ్రమలో పనిచేస్తున్న ఓ వివాహితతో సన్నిహితంగా మెలిగేవాడు. అయితే ఆమె మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడం చూసి తట్టుకోలేక శనివారం రాత్రి చిలమత్తూరు మండలం మొరంపల్లి సమీపంలో విష పూరిత ద్రావకం తాగాడు. అనంతరం తన ఆత్మహత్యకు కారణాలు వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రంతా గాలించినా శివ ఆచూకీని పసిగట్టలేకపోయారు. ఆదివారం ఉదయం చెట్టుకు బెల్టుతో ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతున్న శివను మొరంపల్లి వాసులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా, తమ కుమారుడి మృతికి పరిశ్రమలో పనిచేస్తున్న వివాహితతో పాటు మరో వ్యక్తి కారణమంటూ శివ తండ్రి శ్రీరామప్ప చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన రామాంజినప్ప(60) ఆదివారం పెనుకొండ సమీపంలో హరిపురం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు వైపు వెళుతున్న వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామాంజినప్పను స్థానికులు గుర్తించి, వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు

జిల్లాలో కొనసాగుతున్న సెబ్ దాడులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ దాడులు కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇసుక, మద్యం అక్రమ రవాణాపై సెబ్ అధికారులు ముమ్మర దాడులు చేపట్టారు. పెనుకొండ, ధర్మవరం, హిందూపురం, తనకల్లు సెబ్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో 920 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. అడవి బ్రాహ్మణపల్లి తండాలో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.



పాల్గొన్న పూర్వవిద్యార్థులు

‘అ’పూర్వ’ సమ్మేళనం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అదే పాఠశాల వేదికగా జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను సన్మానించారు. అనంతరం అందరూ విందులో పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న టపాసులు స్వాధీనం

నల్లచెరువు: మండలంలోని చెవిటివారిపల్లిలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు రూ. 2.57 లక్షల విలువ చేసే టపాసులను ఎస్‌ఐ లింగన్న స్వాధీనం చేసుకున్నారు. టపాసులను చెవిటివారిపల్లికి చెందిన నరేంద్రరెడ్డి ఇంటి వద్ద అన్‌లోడ్ చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించుకువచ్చినట్లుగా గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఐచర్ వాహనాన్ని సీజ్ చేశారు. టపాసుల యజమాని మధుసూదన్‌రెడ్డి, ఐచర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వేమన సమాధిని దర్శించుకున్న ఏడీజీపీ



వేమన సమాధి వద్ద పూజలు చేస్తున్న అడిషనల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో వెలసిన విశ్వకవి యోగివేమన సమాధిని అడిషనల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా యానకు ఆలయ మర్యాదాలతో పూజారి నందవేమారెడ్డి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు



శశికుమార్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హిందూపురం అర్బన్: రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని పోలీసులు సకాలంలో కాపాడారు. వివరాలు... కుటుంబంలో ఇబ్బందులు తాళలేక మడకశిర మండలం మనూరుకి చెందిన శశికుమార్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు ఆదివారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలపడంతో వారు అప్రమత్తమై వెంటనే డయల్ 100కు సమాచారం అందజేశారు. దీంతో అప్రమత్తమైన హిందూపురం రూరల్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు రైలు పట్టాల వెంబడి అన్వేషణ చేపట్టారు. రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై కూర్చొని ఉన్న శశికుమార్‌ను గుర్తించి వెంటనే కాపాడి పోలీస్ స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. అనంతరం కుటుంబసభ్యులను పిలిపించి శశికుమార్‌తో పాటు వారికీ కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఘనంగా గుత్తి రైల్వే స్టేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న రైల్వే అధికారులు

గుత్తి: భారతీయ రైల్వే వ్యవస్థలోనే గుత్తి రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక స్థానముందని సీనియర్ డీసీఎం మనోజ్, డీఎంఈ ప్రమోద్ అన్నారు. గుత్తి రైల్వేస్టేషన్ 157వ వార్షికోత్సవాన్ని ఆదివారం రైల్వే ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. స్టేషన్ మేనేజర్ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మనోజ్, ప్రమోద్ మాట్లాడారు. గుత్తి రైల్వేస్టేషన్‌కు బ్రిటిష్ కాలం నుంచి ఎంతో మంచి పేరుందన్నారు. రైల్వే వైద్యాధికారి వెంకటేష్, ఏడీఎంఈ సుంకన్న, ఐపీఎఫ్ అనురాగ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హనూక్, సీనియర్ పొలిటికల్ సైన్స్ లెక్చరర్ గోవిందరాజులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, రైల్వే యూనియన్ నాయకులు నారాయణ, శేఖర్ బాబు తదితరులు మాట్లాడుతూ.. గుత్తి రైల్వేస్టేషన్ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

పెనుకొండ రూరల్: అక్రమంగా జిల్లాలోకి తరలించుకువచ్చిన కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెబ్ సీఐ సుబ్బారెడ్డి వెల్లడించారు. కొత్తచెరువు మండలం లోచర్ల నివాసి జీఎం అన్వర్‌బాషా.. ఆదివారం మారుతీ కారులో 8 బాక్స్‌ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా తిమ్మాపురం వద్ద జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. రూ.30 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు మెహరున్

ఓడీచెరువు: స్థానిక బీసీ కాలనీకి చెందిన వివాహిత షేక్ మెహరున్(45) ఆదివారం ఉదయం అనుమానస్పద స్థితిలో మృతదేహమై కనిపించింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన మేరకు... పదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయిన మెహరున్.. తన కుమార్తె తో కలసి ఒంటరిగా జీవిస్తోంది. ఆదివారం ఉదయం స్నానాలగదికి వెళ్లిన ఆమె ఎంత సేపటికీ తిరిగి రాక పోవడంతో కుమార్తె ఆర్షియా వెళ్లి తలుపు నెట్టింది. లోపల విగతజీవిగా పడి ఉన్న తల్లిని గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ఆర్షియా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల పల్లెబాట

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్‌కు చెందిన విద్యార్థులు వర్సిటీకి సమీపంలోని చిన్నకుంట గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆ గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వేతో పాటు ఆరు ప్రాధాన్యమైన అంశాలలో అధ్యయనం చేశారు. అనంతరం ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి, గ్రామంలో అక్షరాస్యత పెంపు, పేదరికం నిర్మూలన, అభివృద్ధి కార్యక్రమాలను విస్తారంగా చేపట్టారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి ఒక్కో యూనిట్‌కు రూ.36 వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి. ఇలా కేవలం ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒక్కటే కాదు... వర్సిటీ పరిధిలోని ప్రతి డిగ్రీ కళాశాలలో ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్లు ముందుకు వచ్చి ఒక్కో గ్రామాన్ని దత్తతకు తీసుకుని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నాయి.

- ఎస్కేయూ విద్యార్థుల సేవాకార్యక్రమాలు
- ఒక్కో ఎన్ఎస్ఎస్ యూనిట్ తరఫున ఒక్కో గ్రామం దత్తత
- మొత్తం ఆరు ప్రాధాన్యత రంగాల్లో ప్రభుత్వానికి తోడ్పాటు



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అనంతపురం: ‘దేశానికి పల్లె సీమలే పట్టుగొమ్మలు’ అనే నానుడిని నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ నేపథ్యంలో ‘ఉన్నత భారత్ అభియాన్’ పేరుతో గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేలా వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలను భాగస్వాములను చేస్తోంది.

ఎస్కేయూ పరిధిలో 120 గ్రామాల దత్తత

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరిధిలో మొత్తం 120 జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు ఉన్నాయి. ఇందులో క్యాంపస్ కళాశాలల్లోనే నాలుగు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ 120 యూనిట్లు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్నాయి. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న ఆరు ప్రాధాన్యత రంగాలను ఎంచుకుని ఆయా రంగాల అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమిస్తున్నారు. పరిశోధన ఫలాలు, ప్రభుత్వ పథకాలను సమన్వయ పరుస్తూ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా గ్రామీణాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సురక్షిత తాగునీరు, ప్రజారోగ్యం , పరిసరాల పరిశుభ్రత ,వ్యవసాయం, గ్రామీణ చేతివృత్తులు, స్త్రీశిశు సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి ఆరు ప్రాధాన్యత రంగాల అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందేలా..

గ్రామాలను పర్యటించడం, సమస్యలను అధ్యయనం చేయడం వంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో అంతులేని ఆత్మవిశ్వాసం, సాంకేతిక నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతున్నాయి. ఈ క్రమంలోనే గ్రామీణుల అభ్యున్నతికి ఉపయోగపడే నూతన పరిశోధనలకూ మార్గం సుగమమవుతోంది. దత్తత తీసుకున్న పల్లెల్లో స్థానిక ప్రాధాన్యాతల గుర్తింపు, సాంకేతికత బదిలీ వంటి కీలక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది.

నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి



జాతీయ సేవా పథకంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. ప్రతి యూనిట్ తరఫున ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకునేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఒక్కో యూనిట్‌కు రూ.36 వేలు చొప్పున నిధులు అందాయి.

– డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ